





నేడే తీర్పు



- కొన్ని గంటల్లో మొదలుకానున్న ఓట్ల లెక్కింపు
- నేటితో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- రాయలసీమ వర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలు
- గెలుపుపై టీడీపీ, వైసీపీ ధీమా
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- లోక్‌సభ స్థానం బరిలో 19 మంది అభ్యర్థులు
- ఎనిమిది అసెంబ్లీ స్థానాల నుంచి పోటీలో 102 మంది
- లెక్కించాల్సిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 15,93,095

కర్నూలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఓటరు తీర్పు వెలువడే కీలక సమయం ఆసన్నమైంది. 21 రోజుల నిరీక్షణకు మంగళవారం తెరపడనుంది. విజేతలెవరో.. పరాజితులు ఎవరో కొన్ని గంటల్లో తేలిపోనుంది. 2014 ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టిన ఓటర్లు.. 2019 ఎన్నికల్లో జగన్‌కు అవకాశం ఇచ్చారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం పేరిట ప్రగతికి పాతర వేశారు. విధ్వంస పాలన సాగించారు. సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయి. నిత్యావసర ధరలు చుక్కలు తాకాయి. రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలో నెట్టేశాడు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఊడలు పాకింది. 'జన పాలన' లక్ష్యంగా టీడీపీ సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా బరిలో దిగారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయకత్వం కావాలి. కేంద్ర, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలి అంటూ కూటమి నాయకులు, అభ్యర్థులు ప్రజల మధ్యకు వెళ్లారు. మరో చాన్స్ ఇవ్వండని జగన్ జనాన్ని కోరారు. మళ్లీ జగన్‌కు అవకాశం ఇస్తారా..? టీడీపీ సారథ్యంలోని కూటమికి పట్టం కడతారా..? అనేది మంగళవారం తేలనుంది. మెజార్టీ ఎగ్జిట్ పోల్ సర్వే సంస్థలు కూటమికే జై కొట్టాయి. గెలుపుపై ఇరుపార్టీల నాయకులు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక స్థానాలు సాధించి కందనవోలు కోటపై జెండా ఎగుర వేస్తామని అంటున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో మంగళవారం ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. సృజన పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



బస్తిపాటి నాగరాజు, బీవై రామయ్య, రాంపుల్లయ్య, టీజీ భరత్, ఇంతియాజ్, శ్యాంబాబు, శ్రీదేవి, బొగ్గుల దస్తగిరి, ఆదిమూలపు సతీష్, రాఘవేంద్రరెడ్డి, బాలనాగిరెడ్డి, పార్థసారథి, సాయిప్రసాద్‌రెడ్డి, వీరభద్రగౌడ్, విరూపాక్షి, జయనాగేశ్వరరెడ్డి, బుట్టా రేణుక, గౌరు చరిత, రాంభూపాల్‌రెడ్డి

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానాల పరిధిలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 8 అసెంబ్లీ స్థానాల్లో 102 మంది పోటీ చేశారు. 121 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఏప్రిల్ 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. గెలవాలనే లక్ష్యంగా రాజకీయ, సామాజిక సమీకరణలు పరిగణలోకి తీసుకొని ప్రధాన పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలో దింపాయి. ప్రచారంలో వ్యూహ ప్రతి వ్యూహాలు అమలు చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు, హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తే.. వైసీపీ అభ్యర్థుల తరుపున ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రచారం నిర్వహించారు.



రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

నియోజకవర్గాల వారీగా లెక్కించాల్సిన ఓట్లు

నియోజకవర్గం	ఈవీఎం	పోస్టల్ బ్యాలెట్స్	మొత్తం
కర్నూలు	1,74,973	4,349	1,79,322
పత్తికొండ	1,90,009	2,509	1,92,518
కోడుమూరు(ఎస్సీ)	1,95,181	2,837	1,98,300
ఎమ్మిగనూరు	2,03,086	3,119	2,06,205
మంత్రాలయం	1,75,667	722	1,76,389
ఆదోని	1,75,064	1,931	1,77,598
ఆలూరు	2,09,092	1,729	2,10,821
కర్నూలు పార్లమెంట్	13,23,072	17,196	13,40,268
పాణ్యం	2,46,935	5,892	2,52,827
జిల్లా మొత్తం	15,70,007	23,088	15,93,095

కౌంటింగ్ వివరాలు

- ఓట్ల లెక్కింపు : జూన్ 4
- అసెంబ్లీ నియోజకవర్గాలు : 8
- మొత్తం ఓట్లు : 20,54,563
- లెక్కించాల్సిన ఓట్లు (ఈవీఎం) : 15,70,007
- పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లు : 23,088
- కౌంటింగ్ కేంద్రాలు : 8
- కౌంటింగ్ టేబుల్స్ : 112 (ఒక్కో నియోజకవర్గానికి 14)
- రౌండ్లు : 161 (ఒక్కో నియోజకవర్గానికి 19 - 26)
- పార్లమెంట్ స్థానం : కర్నూలు
- మొత్తం ఓట్లు : 17,22,857
- లెక్క పెట్టాల్సి ఓట్లు (ఈవీఎం) : 13,23.072
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 17,196
- కౌంటింగ్ సిబ్బంది : 1,100

21 రోజుల నిరీక్షణకు తెర

కర్నూలు పార్లమెంట్ పరిధిలోని కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు సహా నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పాణ్యం నియోజకవర్గం కలిపి 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20,54,563 మంది ఓటర్లు ఉంటే.. 15,70,007 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 76.42 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే 0.55 శాతం పెరిగింది. అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గంలో 84.98 శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా కర్నూలు నియోజకవర్గంలో 63.75 శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో కర్నూలులో 59.53 శాతమే నమోదైంది. అంటే.. 4.22 శాతం ఓటింగ్ పెరగడం టీడీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఈవీఎంలో పోలైన 15,70,007 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 23,088 కలిపి 15,93,095 ఓట్లు లెక్కించాల్సి ఉంది. 1,100 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 3: కౌంటింగ్ రోజున ఎన్నికల నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సాధారణ పరిశీలకుడు జాఫర్, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల సాధారణ పరిశీలకుడు మీర్ తారీఖ్ ఆలీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ఉండేందుకు మైక్రో అబ్జర్వర్లుగా గెజిటెడ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఒకేసారి అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో జనరల్ అబ్జర్వర్లు ఉండడం సాధ్యం కాదని వారి ప్రతినిధిగా మైక్రో అబ్జర్వర్లను నియమించామని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలు పూర్తిగా అమలు కావాలని అన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్ధలింగమూర్తి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన



బెట్టింగ్‌ల జోరు

పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య 21 రోజులు సమయం ఉండటంతో పోలింగ్ తర్వాత బెట్టింగ్ జోరు తగ్గింది. కౌంటింగ్‌కు ఒకటి రెండు రోజులు గడువు ఉండగా బెట్టింగ్‌రాయుళ్లు పేట్రేగిపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ సర్వే మెజార్టీ సంస్థలు అంచనాలు వేయడం, కొన్ని సంస్థలు మళ్లీ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని అంచనాలు వేయడంతో చివరి రోజు కూడా పెద్ద ఎత్తున బెట్టింగ్ జరిగింది. ముఖ్యంగా రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, జిల్లాలో మెజార్టీ నియోజకవర్గాల్లో టీడీపీ గెలవబోతుందని బెట్టింగ్‌రాయుళ్లు పెందేలు కాస్తున్నారు. వైసీపీనే గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పలువురు పందెం కట్టారు. జిల్లాలో సుమారుగా రూ.50-75 కోట్లకు పైగా బెట్టింగ్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

భారీ వర్షం

- పలుచోట్ల దెబ్బతిన్న రహదారులు, ధ్వంసమైన వంతెనలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు

నెరవాడ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కెరవాగు



కర్నూలు రూరల్/కల్లూరు, జూన్ 3: నైరుతి రుతుపవనాల రాకతో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మే నెలలో అక్కడక్కడా కొద్దిపాటి వర్షం కురిసినప్పటికీ పెరిగిన ఉష్ణోగ్రతల ప్రభావం, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. నైరుతి రుతు పవనాలు కేరళను తాకడంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మరికొన్ని చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నైరుతి రుతుపవనాల ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారీ వర్షానికి కర్నూలు రూరల్ పరిధిలోని కర్నూలు-ఉల్లాల ప్రధాన రహదారి వంతెన కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా పనులను చేపట్టి పునరుద్ధరించారు. దీంతో సి. బెళగల్ మండలం గుండ్రేవుల, సంగాల, కొత్తకోట, కర్నూలు రూరల్ మండలం రేమట, ఉల్లాల వంటి సమీప ప్రాంతాల నుంచి రాకపోకలు స్తంభించాయి. ధ్వంసమైన వంతెనను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్ తదితరులు పరిశీలించారు. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్ సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న భారీ వృక్షం ఆదివారం రాత్రి కురిసిన వాన గాలి బీభత్సానికి నేలకూలింది. ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ పైభాగాన ఉన్న ఇళ్ల మీదకు ఒరిగిపోయి, ప్రధాన రహదారిపై అడ్డంగా పడిపోయింది. కల్లూరు మండలంలో వక్కెర వాగుకు వరద పోటెత్తింది. కల్లూరు మండలం నెరవాడ సమీపంలో వక్కెరవాగు ఉధృతంగా ప్రవహించింది.

జిల్లా వ్యాప్తంగా వర్షపాతం ఇలా...

ఎమ్మిగనూరులో 69.2 మిల్లీమీటర్లు కర్నూలు అర్బన్‌లో 67.4, కల్లూరులో 65.6, హాలహర్విలో 64.6, కర్నూలు రూరల్‌లో 51.2, ఆలూరులో 47.4, గూడూరులో 45.6, తుగ్గలిలో 44.6, ఓర్వకల్లులో 43.2 మి.మీ., వర్షం కురిసింది. కోడుమూరులో 43.2, చిప్పగిరిలో 39.8, గోనెగండ్లలో 34.2, మంత్రాలయంలో 30.8, మద్దికెరలో 27.8, వెల్దుర్తిలో 23.4, నందవరంలో 21.8, దేవనకొండలో 20.6, ఆస్పరిలో 20ఎంఎం, హొళగుందలో 16.4, కౌతాళంలో 16.2, పత్తికొండలో 15.4, ఆదోనిలో 14.2, కృష్ణగిరిలో 13.8, సి.బెళగల్‌లో 12.6, పెద్దకడబూరులో 10.4మి.మీ., వర్షం కురిసింది.

కర్నూలు-ఉల్లాల ప్రధాన రహదారిలో కూలిన వంతెన



మద్యం దుకాణాల్లో దోపిడీ

- ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా రూ.20
- హుశేనాపురంలో హర్యానా, గోవా, తెలంగాణ మద్యం
- మామూళ్ల మత్తులో పోలీసులు
- పని చేయని సీసీ కెమెరాలు



హుశేనాపురం వైన్ షాపు

ఓర్వకల్లు, జూన్ 3: మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, నన్నూరు వైన్‌షాపుల్లో ఎంఆర్‌పీ ధర కంటే రూ.20 అదనంగా ఇస్తేనే మద్యం ఇస్తున్నారు. క్వాటర్ బాటిల్‌కు రూ.20 అదనంగా తీసుకుని ఎంత కావాలంటే అంత మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వైన్‌షాపుల్లో సిబ్బంది అందిన కాడికి దోచుకున్నారు. ఒక్కొక్క కేసుకు రూ.1000 అదనంగా తీసుకుని కావాల్సినంత మద్యం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఇచ్చారు. వైన్‌షాపుకు రోజుకు 30 నుంచి 40 కేసులు మద్యం అమ్మాలని ప్రభుత్వం నిర్ణయిస్తే... 10 కేసులు మాత్రమే మందుబాబులకు అందజేసి మిగతా కేసుల్లో బ్లాకుల్లో అమ్ముకుంటున్నారు. దీంతో ఒక్కరోజుకు రూ.15వేల నుంచి రూ.20వేల దాకా సొమ్ము చేసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు రోజు వైన్‌షాపుల్లో తూతూ మంత్రంగా అమ్మి రాజకీయ పార్టీల నాయకులకు కేసుకు రూ.1000 అదనంగా తీసుకుని రకరకాల బ్రాండ్ల మద్యం సీసాలను సంచుల్లో నింపి పంపించేవారు. ఈ మద్యాన్ని బ్లాకుల్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ శాఖ వారికి చెప్పినప్పటికీ వారు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. మూడు వైన్‌షాపుల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే పని చేస్తున్నది. వైన్‌షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఈ సీసీ కెమెరాల రికార్డులు చూస్తే అవినీతి ఎంత జరిగిందో అర్థం అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

దీంతో వైన్‌షాపుల్లో సిబ్బంది లక్షలాది రూపాయలు జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఈ అవినీతి జరిగి ఉండవచ్చని మందుబాబులు చర్చించుకుంటున్నారు. హుశేనాపురం గ్రామంలో హర్యానా, గోవా, తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన మద్యం జోరుగా విక్రయిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. మంచి మద్యం బ్రాండ్లను వైన్‌షాపుల్లో తూతూ మంత్రంగా అమ్మి సిబ్బంది తన ఇంటి వద్ద ఫుల్ బాటిల్‌కు రూ.200 దాకా వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్‌షాపుల్లో మందుబాబులు తమకు కావాల్సిన బ్రాండ్లు కావాలని అడిగితే అవి అయిపోయాయని చీప్ లిక్కర్ అమ్ముతున్నారు. దీంతో మందుబాబులకు, సిబ్బందికి గొడవ జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎక్సైజ్ పోలీసులు దోపిడీని అరికట్టలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైన్‌షాపుల్లో సీసీ కెమెరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



హుశేనాపురంలో నిల్వ ఉంచిన మద్యం

అవినీతిని అరికట్టండి



వైన్‌షాపుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలి. మంచి మద్యం బ్రాండ్లను అడిగితే.. వైన్‌షాపు సిబ్బంది లేవని, చీప్ లిక్కర్ ఇచ్చి పంపుతున్నారు. దీంతో మద్యం ప్రియులు రోగాలబారిన పడుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

\- అల్లాబాబు, స్థానికుడు

నాణ్యమైన బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేయండి



వైన్‌షాపుల్లో నాణ్యమైన బ్రాండ్లను సరఫరా చేయాలి. నాణ్యమైన మందును పక్కదారి పట్టించి చీప్ లిక్కర్‌ను సరఫరా చేస్తున్నారు. ఈవిషయంపై సిబ్బందిని అడిగితే.. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

\- వేణుగోపాల్ రెడ్డి, స్థానికుడు

గ్రామాల్లో బెల్టుషాపుల జోరు:



ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లో బెల్టుషాపులు ఉండకూడదు. అయితే వైన్‌షాపు సిబ్బంది, బెల్టు షాపుల నిర్వాహకులు కుమ్మక్కై ఒక్కో బాక్సుపై రూ1000 అదనంగా తీసుకుని బెల్టు షాపు విక్రయదారునికి సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుస్తున్నాయి.

\-యాసిన్‌బాషా, స్థానికుడు

కోడి పందేల స్థావరంపై దాడి

చాగలమర్రి, జూన్ 3: చాగలమర్రి నుంచి నారాయణపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో కోడిపందేల నిర్వహిస్తున్న స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆళ్లగడ్డకు చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన నలుగురు, చాగలమర్రి, నంద్యాల, శిరివెళ్లకు చెందిన ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీసులు శివకాంత్, శివారెడ్డి, బాలు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్ల పట్టివేత

చాగలమర్రి, జూన్ 3: చాగలమర్రి గ్రామంలోని చాగలమ్మ ఆలయం వద్ద సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా 40 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన నరసింహులును సోదా చేయగా అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

కుక్కల దాడిలో రెండు దుప్పులు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పికూన

ఆత్మకూరు, జూన్ 3: ఆత్మకూరు మండలంలోని అటవీ సమీప గ్రామమైన ముష్టెపల్లిలో సోమవారం కుక్కలు దాడిలో రెండు దుప్పులు మృతి చెందాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో అటవీ ప్రాంతంలోని సుమారు 5 దుప్పులు బెదిరిపోయి సమీప ముష్టెపల్లి గ్రామ శివారుకు చేరుకున్నాయి. వీటిని గమనించిన కుక్కలు వాటిపై దాడి చేయడంతో మూడు దుప్పులు సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లగా 6నెలల వయస్సు గల దుప్పికూన అక్కడికక్కడే మృతి చెందింది. మరో రెండేళ్ల వయస్సు గల దుప్పిని కుక్కలు గాయపరుస్తుండగా గ్రామస్థులు దుప్పిని రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బైర్లూటిలోని వన్యప్రాణి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా అది కోలుకోలేక మృతిచెందింది. రెండు దుప్పుల కళేబరాలను ఖననం చేసినట్లు బైర్లూటి రేంజ్ అధికారి సుభాష్ తెలిపారు.

మహానందీశ్వరునికి 101 టెంకాయలు



ధ్వజ స్తంభానికి కొబ్బరి కాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

మహానంది, జూన్ 3: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయం సాధించాలని మహానంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం మహానంది క్షేత్రంలోని ధ్వజ స్తంభానికి 101 టెంకాయలు సమర్పించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి తెచ్చిన ప్రత్యేక జలాలతో మహానందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మధు, టీడీపీ నాయకులు కంచర్ల శివ, నాగపుల్లయ్య, శివ, మహేశ్వరరెడ్డి, మారెడ్డి సుబ్రమణ్యం, జయరాముడు, నాగరాజు, రంగస్వామి, సుంకులయ్య, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

డయోగ్నస్టిక్ బ్లాక్‌లో అన్ని పరీక్షలు



ప్రారంభిస్తున్న డా.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 3: కొత్తగా నిర్మించిన న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని న్యూడయోగ్నస్టిక్‌లో ఈసీజీ మిషన్ సేవలు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డా. సునీల్ ప్రశాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రోగుల సౌకర్యం కోసం ఈసీజీ సేవలను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి అత్యవసర విభాగమైన క్యాజువాల్టీలో మరో ఈసీజీ మిషన్‌ను ఏర్పాటు చేశామని, న్యూడయోగ్నస్టిక్ స్టిక్ బ్లాకులో అన్ని సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డా.వెంకటేశ్వరరావు, ఏఆర్‌ఎంవో డా.వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.శివబాల పాల్గొన్నారు.

20 పడకలతో మరో క్యాజువాల్టీ: అత్యవసర రోగుల సౌకర్యార్థం 20 పడకలతో మరో క్యాజువాల్టీ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆసుపత్రిలో న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ రేడీయాలజీ., క్యాజువాల్టీ ఔషధ శాలలను తనిఖీ చేశారు. క్యాజువాల్టీ రద్దీ దృష్ట్యా ఔషధ శాల, ఈసీజీ, ఓపీ నెంబరు -2ల స్థానంలో మరో క్యాజువాల్టీని ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రశాంత ఓట్ల లెక్కింపునకు చర్యలు: డీఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ

కౌంటింగ్ విధులపై డీఐజీ దిశానిర్దేశం



సమావేశంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

నంద్యాల క్రైం/పాణ్యం, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం చేపట్టాల్సిన విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కాలేజిలోని మీటింగ్ హాల్‌లో జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో కలిసి డీఐజీ పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. మూడంచెల భద్రతతోపాటు సాయుధ బలగాల ద్వారా ఫుట్ పెట్రోలింగ్ పార్టీ, మొబైల్ పార్టీలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించిన గుర్తింపు కార్డున్న వ్యక్తులు మినహా ఇతరులు లోపలికి ప్రవేశించకుండా తనిఖీ చేయాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తెచ్చుకోకుండా చూడాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను ఆర్‌ఓ ఆదేశాల మేరకు వెంటనే పికప్ వాహనాల్లో ఎక్కించాలని ఆదేశించారు. పెన్ను, పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌తోపాటు 30-పోలీస్‌యాక్ట్ అమల్లో ఉంటాయని తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరైనట్లయితే తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, డీఎస్పీలు కుమారస్వామి, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసరావు, తిలక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నల్లవాగులో వజ్రాన్వేషణ

రుద్రవరం, జూన్ 3 : నల్లమల అటవీ తీరంలోని నల్లవాగు ప్రాంతంలో సోమవారం ముమ్మరంగా వజ్రాల అన్వేషణ కొనసాగింది. వజ్రాలు దొరుకుతాయని ఆశతో ఒంగోలు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి భారీగా ఆశావహులు తరలివచ్చి నల్లవాగును జల్లెడ పడుతున్నారు. చిన్న చిన్న వజ్రంలాంటి రాళ్లను ఏరి దాచుకుంటున్నారు. వెదికితే ఒక్కటన్నా దొరకదా అనే ఆశతో వజ్రాల వేట సాగిస్తున్నారు. నల్లమల అడవిలో భారీ వర్షం కురవడంతో నల్లవాగులో నీటి ప్రవాహం మొదలైంది. వజ్రాల కోసం వచ్చిన నీటిలో సైతం రాళ్లను బయటకు తీసి వజ్రాలను అన్వేషిస్తున్నారు. కొందరికి వజ్రంలాంటి రాళ్లు దొరికాయని అక్కడ పలువురు చర్చించుకున్నారు.



దొరికిన వజ్రం లాంటి రాయి ఇలా..

నల్లమల అటవీ తీరంలో ప్రవహిస్తున్న నల్లవాగు



జల్లెడలో మట్టిని పోసి.. దులుపుతూ..



మట్టిని తీసి.. పరిశీలిస్తున్న మహిళ



వజ్రం కోసం మట్టిని తవ్వుతున్న వ్యక్తి

కౌంటింగ్ ఏర్పాట్లకు సర్వం సిద్ధం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 3: కౌంటింగ్ ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటరులో కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ హాల్ ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఇచ్చే శిక్షణ తరగతులు రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్ అబ్జర్వర్ల సీటింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్, మెడికల్ క్యాంపు, ఎలక్ట్రిక్ కనెక్షన్స్ ఎమర్జెన్సీ ఎగ్జిగట్ సిస్టమ్, ఫైర్ సేఫ్టీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వాళ్లు అధికారంలో ఉంటారని, ప్రశాంతతకు భంగం కలిగించకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. జిల్లా యంత్రాంగం, పోలీసుల సమష్టి కృషితో పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత ప్రశాంత వాతావరణం ఉందని, కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. కౌంటింగ్ హాల్ వద్ద నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాల్‌కు వెళ్లే ప్రతి ఈవీఎంకి కూడా ఏఆర్ ఎస్కార్ట్ ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు కాకుండా ఏ ఇతర వ్యక్తులు కూడా కౌంటింగ్ సెంటరులోకి ప్రవేశించకుండా 3 కట్ ఆఫ్ సెక్యూరిటీ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్లు వాహనాలకు కౌంటింగ్ హాల్‌కు 200 మీటర్ల ప్రాంగణంలో పార్క్ చేయించి ఫోన్లు డిపాజిట్ చేశాక ఏఆర్ పోలీసు టీమ్స్ మరలా ఒకసారి చెక్ చేసి కౌంటింగ్ హాల్లోకి పంపిస్తారని వివరించారు.

విద్యుత్ శాఖలో మరో ఉద్యోగిపై వేటు

- అక్రమ విద్యుత్ కనెక్షన్‌ల వ్యవహారంపై లైన్‌మెన్ సస్పెండ్
- నెల వ్యవధిలో ఇద్దరిపై వేటు

ఆలూరు, జూన్ 3: విద్యుత్‌శాఖలో అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నది. ఆలూరు మండల విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణను సస్పెండ్ చేసినట్లు ఆలూరు ఇన్‌చార్జి డీఈఈ పురుషోత్తం సోమవారం తెలిపారు. నెల వ్యవధిలో డీఈఈ నాగేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణలపై సస్పెన్షన్ వేటు పడటం విద్యుత్‌శాఖలో తీవ్ర కలకలం రేపింది. దీంతో మిగతా సిబ్బంది అంతా అప్రమత్తమయ్యారు. గత నెల 18న అక్రమ విద్యుత్ కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఆలూరు డీఈఈ నాగేంద్ర ప్రసాద్ అనుమతి ఇచ్చారని నిర్ధారణ కావడంతో జిలా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, ఆయనను సస్పెండ్ చేశారు. నెల రోజులు గడవక ముందే వెంకటరమణను సస్పెండ్ చేశారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు, జూన్ 3: కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో జరిగే ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. సోమవారం ఎన్నికల విధులపై పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న అవాంఛనీయ సంఘటనలకు కూడా తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాల్లోకి రిటర్నింగ్ అధికారుల అనుమతి పత్రం లేనిదే ఎవరినీ అనుమతించకూడదన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు, ఆర్వో, ఏఆర్వో, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌ను విజయవంతంగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లను సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితిష్ వ్యాస్ ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ పోస్టు పోల్ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోనికి అనుమతించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మెడికల్ టీమ్స్, అంబులెన్స్, తాగు నీరు, నిరంతర విద్యుత్ బ్యాక్ అప్ ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు రౌండ్ల వారీగా డేటా మొత్తాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీలతో పాటు పాణ్యం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం: ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో భార్గవతేజ

కర్నూలు(కల్చరల్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బంది అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గం ఆర్వో, నగర పాలక కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థలోని ఆయన కార్యాలయంలో ఆర్‌యూలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశానరు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపులో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చెల్లిన, చెల్లని బ్యాలెట్ ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కింపు నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులకు పోలైన ఓట్లను సంబంధిత పత్రాల్లో నమోదు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా అంకెలను స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. ఈటీపీబీఎస్, టేబులేషన్, సీలింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఏఆర్వో మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగశివలీల, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భార్గవతేజ తనిఖీ చేశారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 3: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సస్ బ్లాక్‌లో జరిగే ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. 258 పోలింగ్ కేంద్రాలు ఉండగా 19 రౌండ్లలో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. నియోజకవర్గంలో 2,74,465 ఉండగా ఇందులో 1,32,769 మంది పురుషులు, 1,41,665 మంది మహిళలు, 31 మంది ఇతరులు ఉండగా 1,74,973 మంది తమ ఓటు హక్కు వినియోగంచుకున్నారు. అందులో పురుషులు 86,250, మహిళలు 88,715, ఇతరులు 8 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 63.75 శాతం పోలింగ్ జరిగింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4349 మంది, సర్వీసు ఓటర్లు 92 ఉండగా 34 మంది ఓటు వేశారు.

సమయ పాలన పాటించాల్సిందే..!

కర్నూలు(హాస్పిటల్), జూన్ 3: ఆసుపత్రి మినీస్టీరియల్ సిబ్బంది, వైద్యులు తప్పకుండా సమయపాలన పాటించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మినీస్టీరియల్ సిబ్బంది ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని, వైద్యులు సీఎస్‌ఆర్‌ఎంవో డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో, ఏఆర్‌ఎంవో మెడికల్ ఆఫీ సర్లు అసిస్టెంట్లు ప్రొఫెసర్లు అందరూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది సమయపాలన పాటించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఎంవోలు తమ డ్యూటీ రోజుల్లో సరైన సమయాలను పాటించి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని పలు విభాగాలకు తనిఖీ చేయాలని ఆదేశించారు.

రైతుల పాలిట శాపంగా నకిలీ విత్తనాలు



నకిలీ విత్తనాల ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 3: నకిలీ విత్తనాలు రైతుల పాలిట శాపంగా మారాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు ఎం.సుమలత అన్నారు. సోమవారం 48వ వార్డు రోజావీధిలో నకిలీ విత్తనాల ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ మార్కెట్లోకి నకిలీ విత్తనాలు క్వింటాళ్లలో వస్తుంటే అధికారులు మాత్రమే పట్టుకునేది కిలోలలో ఉందని విమర్శించారు. జిల్లాలో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిపి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులను కాపాడాలని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేషమ్మ, శంకరమ్మ, వెంకటలక్ష్మమ్మ, కరైమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణ పౌరులుగా తీర్చిదిద్దే సత్తా క్రీడలదే



సీలంబం క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 3: క్రమశిక్షణా గల పౌరులుగా చిన్నారులను తీర్చిదిద్దే సత్తా క్రీడలకే ఉందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. సోమవారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సీలంబం వేసవి క్రీడాశిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడల్లో సాధన చేస్తున్న క్రీడాకారులకు ఆయన పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు రాఘవేంద్ర, చిన్నారులు పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- ఓట్ల లెక్కింపుపై అందరి దృష్టి
- అభ్యర్థుల్లో ఉత్కంఠ
- ఫలితాలపై అసక్తి చూపుతున్న జనం
- శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసుల బందోబస్తు



కర్నూలు(అర్బన్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. రాయలసీమ యూనివర్సిటీ వేదికగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుండటంతో సోమవారం సాయంత్రం నుంచే బలగాలు భారీ ఎత్తున మోహరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు సర్వే సంస్థలు చేపట్టిన ఎగ్జిట్ పోల్స్ వెలువడంతో కర్నూలు నియోజకవర్గంలో గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. మరో వైపు ఎలాంటి ఫలితాలు అందిస్తాయనే విషయమై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ప్రధాన పార్టీ నాయకులు గెలుపు ధీమా వ్యక్తం చేస్తు న్నారు. అయితే టీడీపీ అభ్యర్థి గెలుపు తథ్యమని ఏ వార్డులో చూసినా ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి తగ్గట్టుగానే సర్వే సంస్థలు టీజీ భరత్ గెలుపు తథ్యమని తేల్చడంతో ఆ పార్టీలో కౌంటింగ్ ప్రక్రియ కోసం తీవ్ర ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు.

● **టీడీపీ ధీమా..** కర్నూలు తెలుగుదేశం అభ్యర్థి టీజీ భరత్ విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు నమ్మకంతో ఉన్నారు. వార్డుల వారిగా తమకు వచ్చే అధిక్యతను లెక్కలు కట్టి 20 వేల పైబడి ఓట్ల అధిక్యతతో విజయం సాధిస్తామని విశ్లేషిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి స్థానికేతరుడు కావడం,



ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం పైన వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి



మ్యానిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు చెబు తున్నారు. నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, నరసింహా రెడ్డి నగర్, ధర్మ పేట, చిదంబర రావు వీధి, బీ క్యాంప్, బుధ వారపేట, పాత బస్తీలోని పలు వార్డుల్లో అధిక్యత వచ్చే పరిస్థితి ఉందని వారు లెక్క లు వేస్తున్నారు. ఇక వైసీపీలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గ పోరు అభ్యర్థికి మైనస్‌గా చెబుతున్నారు. ఆయా వర్గాలు పైకి ప్రచారం చేసినా.. లోలోపల టీడీపీకి పని చేశాయనే ప్రచారం జోరుగా ఉంది. వైసీపీకి కంచుకోటగా ఉన్న వార్డుల్లో సైతం కీలక నాయకులు టీడీపీ కండువా కప్పుకుని బహిరంగంగానే ప్రచారం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ వారు విజయం తమదేనని ధీమాగా చెబుతున్నారు.

● **గెలుపుపై వైసీపీ ఆశలు..** వైసీపీ అభ్యర్థిని ప్రకటించడం మొదలు.. ప్రచారం, పోలింగ్ ప్రక్రియ వరకు నిరాశలో కనిపించిన వైసీపీ నాయకులు సైతం గెలుపు తమదేనని ధీమా వ్యక్త పరుస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ గెలుస్తాననే చెబుతున్నారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల నిబంధనలు పాటించాలి
- ఏజెంట్లకు అవగాహన కల్పించిన గౌరు దంపతులు



మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆదేశించారు. సోమవారం మాధవీ నగర్‌లోని తమ నివాసంలో కౌంటింగ్ ఏజెంట్లకు గౌరు దంపతులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకే ఐడీకార్డు, ఆధార్‌కార్డు, పెన్ను, బుక్కు, ఎన్నికల అధికారులు ఇచ్చిన పాసులతో రాయలసీమ యూనివర్శిటీలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరిగినా ఏజెంట్లు ఎన్నికల అధికారులకు వెంటనే తెలపాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఏజెంట్లు అక్కడే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గౌరు జనార్దన్‌రెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, డి.రామాంజనేయులు, జవ్వాజీ .గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: ఎస్‌ఐ

సి.బెళగల్, జూన్ 3: మండలంలోని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ తిమ్మారెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బాణ సంచాలు కాల్చడం చేయరాదని, గుంపులుగా.. గుంపులుగా ఉండరాదని అన్నారు.

కూటమిదే విజయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు(అర్బన్), జూన్ 3: జిల్లాలో కూడా కూటమిదే విజయమని సర్వేలు, జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, రాష్ట్ర నాయకులు నంద్యాల నాగేంద్ర, రేణుకా ఎల్లమ్మ ఉపాసకులు పుల్లయ్య స్వామితో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీదే విజయమని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకుంటారని, లోకేష్ పాదయాత్రలోనే జ్యోతిష్య నిపుణు లు తెలిపారన్నారు. రాష్ట్రంలోనే కాక జిల్లాలోని ఎంపీ, 7 అసెంబ్లీ స్థానాల్లో కూడా కూటమీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలవబోతు న్నారని, జిల్లాలో నిర్వహించిన పలు సర్వే సంస్థలు కూడా ఇదే తేల్చాయని అన్నారు. మంగళవారం జరగబోయే కౌంటింగ్‌పై ఉత్కంఠ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదని, అన్ని వర్గాల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తంమైందని, దాని పర్యవసానమే ఈ ఎన్నికల్లో వైసీపీ ఓటమికి మార్గమైందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని డీఈసీసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంత రత్నం మాదిగా అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున కూర్చుండే ఏజెంట్లు ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఉదయం 6 గంటలకే ఐడీకార్డు, ఆధార్ కార్డు, ఒక్క బుక్కు, పెన్ను తీసుకుని వెళ్లాలని, టీఫిన్, మధ్యాహ్నం భోజనం అక్కడే ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బయటకు వచ్చే అవకాశం ఉండదని, కౌంటింగ్ ప్రదేశంలో జాతీయ పార్టీలకు సంబంధించిన ఏజెంట్లు ముందు వరుసలో అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పక ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి షేక్ జీలానీబాషా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బీ. బతుకన్న, లాజరస్, షేక్ ఖాజా హుస్సేన్, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

టోల్ గేట్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 3: పెంచిన టోల్ గేట్ చార్జీలను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా టోల్‌గేట్ చార్జీలు మూడు నుంచి ఐదు శాతం పెంచు తున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టోల్ చార్జీల పెంపును వాయిదా వేసిన కేంద్రం ఎన్నికల ముగి యడంతో పెంచుతూ ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. పెంచిన చార్జీలతో బడా కంపెనీలు లాభపడతాయని అన్నారు. చార్జీలు ఉప సంహరించుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఫలితాల తర్వాత మాట్లాడండి: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), జూన్ 3: జగన్ మాటలు విని చంద్రబాబుని దూషించిన దుర్మార్గులు మంగళవారం ఫలితాల తర్వాత మాట్లాడండని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంక టేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెల్లంపల్లి, కొడాలి, వల్లభనేని, అంబటి లాంటి వైసీపీ చెంచాలు గతంలో మాదిరిగా ఇక మాట్లాడగలరా? అని ప్రశ్నించారు. మంత్రి పదవీ వ్యామోహంతో దుర్మార్గులైన సైకో జగన్ మెప్పు కోసం చంద్రబాబును నోటి కొచ్చినట్లు తిట్టిన వారు ఇక కాచుకో వాలని హెచ్చరించారు. తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి పూర్తి స్థాయి మెజార్టీ సాధించి, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, కేంద్రంలో మోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కోడుమూరు(రూరల్), జూన్ 3: మండలంలోని ముడుమల గుర్తిలో టీడీపీ యువనాయకుడు మధు తండ్రి మల్లెమాల చిన్న మద్దిలేటి (59) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెం దాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న టీడీపీ నేత, కోడుమూరు మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నాయకులు ఈశ్వరప్ప, మల్లేష్ ఉన్నారు.

కోడుమూరులో భారీ వర్షం





గోరంట్లలో జగనన్న కాలనీలో నిలిచిన వర్షపునీరు, గూడూరు మండలం పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు

కోడుమూరు(రూరల్), జూన్ 3: మండలంలో భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు తల్లడిల్లారు. వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆదివారం రాత్రి నుంచే గాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఇళ్లలోకి పరుగులు తీశారు. భారీవర్షం పడ డంతో పొలాలు పదునెక్కాయి. చెక్‌డ్యాంలకు జలకళ సంతరిం చుకుంది. నైరుతి ఆగమనంలోనే వర్షం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. విత్తు పనులకు అనుకూలంగా మారిందని అన్నారు. గోరంట్ల గ్రామంలోని జగనన్న కాలనీలో వర్షపునీరు నిలిచింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

గూడూరు: గూడూరులో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఒంటి గంట ప్రాంతం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. గూడూరు మండలంలో 45.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఈ వర్షానికి వంకలు, వాగులు పొంగి పోర్లాయి. మండలంలోని పెంచికలపాడు దగ్గర ఉన్న బ్రిడ్జిపైకి వరద నీరు చేరి ప్రవహించింది. దీంతో గంట పాటు ఎక్కడి వాహ నాలు అక్కడే నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అయితే జూన్ మొదటి వారంలోనే వర్షం కురవడం పట్ల విత్తనాలు వేసేందుకు అనువుగా ఉంటుందని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓపీ కోసం రోగుల ఇక్కట్లు



ఓపీ చీటి కోసం బారులు దీరిన రోగులు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 3: సోమవారం వస్తే చాలు.. కర్నూ లు ప్రభుత్వ వైద్యశాలలో ఓపీ టికెట్ల కోసం రోగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తుంది. తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఉదయం విద్యుత్ అంతరాయం తోడు కావడంతో సర్వర్ మొరా యించడంతో రోగులు ఓపీల కోసం పడిగాపులు కాశారు. దీంతో కొంత సేపు ఓపీలను సిబ్బంది చేతిరాతతో టికెట్లను ఇవ్వడంతో రోగులు బారులు తీరారు. అడ్మిషన్ కౌంటర్ ఉంచి క్యాజువాల్టీ వరకు రోగులు క్యూలైన్లలో నిలబడ్డారు. సోమవారం సాధారణ ఓపీ రోగులు 2వేల మంది రాగా, పాత రోగులు మరో 600 మంది రావడం జరిగింది. ఆసుపత్రిలో ప్రధాన కేంద్రంలో నాలుగు ఓపీ టికెట్ల కేంద్రాలు, ఒక అడ్మిషన్ కౌంటర్, గైనిక్, పీడీయాట్రిక్ విభాగాల్లో ఒక్కక్క కౌంటర్లు ఉన్నాయి. ముఖ్యంగా రోగులు ఎక్కువగా వచ్చే ప్రధాన కేంద్రం వద్ద కేవలం నాలుగు కేంద్రాలు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 2500 నుంచి 3,000ల మంది రోగులు వచ్చే ఆసుపత్రికి ప్రధాన ఓపీ కేంద్రం వద్ద మరో ఆరు ఓపీ టికెట్ల కేంద్రాలను పెంచాలని రోగులు కోరుతున్నారు. ఓపీ టికెట్లు రెండు, మూడు గంటలు ఆలస్యం కావడం వల్ల వైద్యసేవలకు ఆలస్యమవుతున్నాయనీ అదే ఓపీ టికెట్ త్వరగా అందిస్తే చికిత్సలను వేగవంతంగా పొంద వచ్చన్నారు. కొత్తగా వచ్చిన సూపరింటెండెంట్ రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఓపీ కేంద్రాల సంఖ్యను పెంచాలని రోగులు కోరుతున్నారు.

పిల్లల పెరుగుదలను కనిపెట్టాలి: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), జూన్ 3: చిన్న పిల్లల పెరుగుదలను తల్లిదండ్రులు కనిపెట్టాలని కర్నూలు డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం సర్వజన వైద్యశాలలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ క్లబ్ ఫూట్ (వంకర పాదాలు) దినోత్సవం సందర్భంగా క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహె చ్‌వో మాట్లాడుతూ ఈ సమస్యను త్వరగా గుర్తించి ఆపరేషన్ లేదా చికిత్స ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ ఇది ఒక రకమైన పుట్టుకతో వచ్చే రుగ్మత అని దీనికి కారణాలు తెలియవ న్నారు. ఇది జన్యుపరమైన కారణాల వల్ల రావచ్చన్నారు. మద్యపానం, ధూమపానం చేసిన లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా పుట్టుబో యే బిడ్డకు క్లబ్ ఫూట్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త హేమలత మా ట్లాడుతూ ఈ సమస్య ఉన్న వారు కర్నూలు హెల్ప్‌లైన్ 880001558, 8800020503 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్థో సర్జన్ డాక్టర్ పవన్, అర్చనా, డైస్ పీడీయాట్రిషన్‌లు డాక్టర్ సృజన, కీర్తన, ఫిజియో థెరపిస్టు ప్రవీణ, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ట్రస్టు సమన్వయకర్త రేష్మా, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సంస్కృత శిక్షణ శిబిరం ప్రారంభం

కర్నూలు(కల్చరల్), జూన్ 3: పాతనగరంలోని గీతా మందిరంలో పది రోజుల పాటు జరిగే ఉచిత సంస్కృత భాషా అభ్యసన (శిక్షణ) శిబిరాన్ని సోమవారం సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సంస్కృతంలో మాట్లాడటం నేర్చుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు సెల్ నెం. 92471 44245లో సంప్రదించవచ్చని తెలిపారు.

చినుకు పడితే చిత్తడే



గూడూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

గూడూరు, జూన్ 3: చినుకు పడితే చాలు చిత్తడి .. చిత్తడిగా మారుతుంది గూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ. సోమ వారం గూడూరులో వర్షం కురిసింది. దీంతో గూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షం నీరు నిలవడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఈ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ, వసతి గృహం వంటి ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. అయితే వర్షం కురిసిందంటే చాలు గూ డూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ వర్షం నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. ఈ ఆవర ణలో వర్షం నీరు నిలబడకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 3: డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో సమ్మర్ క్యాంపు హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి, బాశెట్టి శ్రీనివాసులు హాజరై క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, క్యాంపు కోచ్ చిన్న సుంకన్న, విశ్రాంత ఉద్యోగి శేషఫణి పాల్గొన్నారు.



క్రీడాకారులతో అతిథులు

కౌంటింగ్ డౌన్..

నేడే కౌంటింగ్.. భరించలేని ఉత్కంఠ

ఎప్పుడు... ఎప్పుడా... అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది... గత నెల 13న జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఎట్టకేలకు మంగళవారం జరగనుంది. దీంతో టీడీపీ, వైసీపీ ముఖ్య నాయకులు అభ్యర్థులు సోమవారం కర్నూలు చేరుకున్నారు.

● గెలుపు ఎవరిదో...?



ఆలూరు, జూన్ 3: ఏ గ్రామంలో అనుకూల ఓట్లు పడ్డాయి.. ఎక్కడ వ్యతిరేకత ఉందో అనే లెక్కలు వేసుకొని తామే గెలుస్తామనే ధీమాలో ఉన్నా.... లోలోపల మాత్రం అభ్యర్థుల్లో, క్యాడర్‌లో భరించలేని ఉత్కంఠ నెలకొంది. ఈ సారి ఓటింగ్ శాతం భారీగా పెరిగినా.., ఓటర్లు ఎవ్వరి వైపు మొగ్గు చూపారన్నది తేలనుంది.. ఇప్పటికే తమ అభ్యర్థి గెలుపు ఖాయం అంటూ బెట్టింగ్‌లు కూడా కట్టారు. దీంతో వారిలో కూడా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, వైసీపీ అభ్యర్థి విరుపాక్షి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. 10 వేల మెజారిటీతో గెలవబోతున్నాం అంటూ ఒకరు.. 15 వేల మెజారిటీ వస్తుంది అంటూ మరొకరు క్యాడర్‌కు భరోసా ఇస్తున్నారు..



● ఆదోని ఫలితం పై సర్వత్రా ఉత్కంఠ



ఆదోని, జూన్ 3: నియోజకవర్గం ఫలితంపై ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఆసక్తి నెలకొంది. మంగళవారం వెల్లడికానున్న ఫలితాలపై పెద్దఎత్తున బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. పోలింగ్‌లో మొత్తం 2,63,058 లక్షల ఓట్లు 66.55 శాతం పోలయ్యాయి.

● క్రాస్ ఓటింగ్‌పై బెంబేలు...

ఆదోని అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్‌లో పెద్దఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీ పార్టీ నాయకులు బయట ధీమాగా కనిపిస్తున్నా... లోలోన టెన్షన్‌తో సతమతమవుతున్నారు. దీంతో బూత్‌ల వారిగా పోలైన ఓట్లలో లాభనష్టాలను లెక్కిస్తూ క్రాస్ ఓటింగ్ పై అంచనాకు వస్తున్నారు. పోలింగ్ రోజు గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నాడిని పసిగట్టడంతో కొంత మేరకు సఫలం చెందినట్లు చెప్పుకొస్తున్నారు. అయితే అర్బన్‌లో మాత్రం స్పష్టంగా చెప్పలేకపోయారు. భారీఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందనే సమాచారం వస్తుండడంతో నాయకులు ఒత్తిడికి గురవుతున్నారు. ఏదేమైనా విజయం మాత్రం తమదేనని, 20 నుండి 30 వేల మెజారిటీతో గెలుస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, పోలింగ్‌కు ముందు జరిగిన పరిస్థితులను గమనించిన ప్రజలు అధికార పార్టీ ప్రలోభాలకు గురికాకుండా తమకు విజయాన్ని అందిస్తున్నారని కూటమి నాయకులు చెబుతున్నారు.



టీడీపీ ఆశలన్నీ పట్టణం, నందవరంపైనే



ఎమ్మిగనూరు : టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి ఆశలన్నీ ఎమ్మిగనూరు పట్టణం, నందవరం మండలంపైనే అధికంగా ఉన్నాయి. ఆది నుంచి ఎమ్మిగనూరు పట్టణం టీడీపీకి కంచుకోటగా ఉంది. పట్టణంలోని 34వార్డుల్లో అత్యధికంగా ఉన్న చేనేత వర్గాలు దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి కాలం నుంచి టీడీపీని ఆదరిస్తూ వస్తున్నాయి. 2019లో జగన్ హవా కొనసాగినప్పటికి ఎమ్మిగనూరు పట్టణంలో టీడీపీకి 7500లకుపైగా మెజార్టీ వచ్చింది. అలాగే గోనెగండ్లతో పాటు కొన్ని మేజర్ పంచాయతీల్లో కూడా టీడీపీ కి అనుకూలంగా ఓటింగ్ జరిగినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మిగనూరు మండలంలో ఎమ్మెల్యేకు సొంత గ్రామంతో పాటు పట్టున్న గ్రామాలైన కడిమెట్ల, సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, ఎర్రకోటలో సైతం తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని ధీమాతో ఉన్నారు.

చేనేత ఓటు బ్యాంకుపైనే వైసీపీ ఆశలు



ఆది నుంచి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పట్టున్న ఎమ్మిగనూరు మండలంతో పాటు పట్టణంలో చేనేత ఓటర్లపైనే వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పట్టున్న ఎమ్మిగనూరు మండలంలోని 32 గ్రామాల్లో వైసీపీకి ఓటర్లు అధికంగా మొగ్గు చూపారని, అలాగే గోనెగండ్ల మండలంలో కూడా తమకు ఓటింగ్ అనుకూలంగానే జరిగిందని ధీమాను వ్యక్తం చేస్తున్నారు.



నువ్వా...నేనా... నేతల్లో మొదలైన గుబులు

మంత్రాలయం : మంత్రాలయం నియోజకవర్గ గెలుపు జిల్లాలోనే తొలి ఫలితం కావడంతో గెలుపుపై ఉత్కంఠ నెలకొంది. ఈనియోజకవర్గంలో బీసీలోని వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డి, ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వైసీపీ నుంచి పోటీలో ఉన్నారు.ఓటింగ్ నువ్వా..నేనా.. అన్న రీతిలో పోటీ జరిగింది. 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ 17 రౌండ్లు 14 టేబుల్లలో లెక్కించనున్నారు. 2,08,350 ఓటర్లు ఉండగా 1,75,667 మంది 237 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేడు జరిగే ఫలితాల్లో కౌతాళం మండలంలోని కొత్తగుడికంబాలి మొదలై పెద్దకడబూరు మండలం హనుమాపురంతో ముగుస్తుంది. 17 రౌండ్లలో మొదటి రౌండు నుంచి టీడీపీ, వైసీపీ మధ్య నరాలు తెగే ఉత్కంఠ సాగనుంది.





భారీ వర్షం

మార్లమాడికి వద్ద వేదవతి నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

హాలహర్వి/హొళగుంద/ఎమ్మిగనూరు రూరల్, జూన్ 3: హాలహర్వి మండలంలో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రాత్రి వర్షంతో పాటు భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులు మెరిశాయి. దీంతో బాపురం గ్రామంలో పచ్చని టెంకాయ చెట్టుకు పిడుగు పడి మంటలు చెలరేగాయి. చెట్టుకు మంటలు వ్యాపించడంతో స్థానికులు భయపడ్డారు. వెంటనే వర్షం చినుకులు పడటంతో మండలు ఆరిపోయాయి. చింతకుంట గ్రామం వద్ద తాత్కాలిక వంతెన వాగుకు కొట్టుకుపోవడంతో బళ్లారి, ఆదోని, ఆలూరు హాలహర్వి, హగరి ప్రాంతాలకు వెళ్ళే రాకోకలు స్తంభించిపోయాయి. వేదావతి వాగునీటితో కళకళలాడింది వర్షాలు లేక సాగు చేయని మండల రైతులు సాగుకు సిద్ధమైయ్యారు. రాత్రి కురిసిన భారీ వర్షం రైతులకు ఎంతో మేలు జరిగింది.

వేదవతి నదికి వరద నీటి ప్రవాహం

హొళగుంద మండల పరిధిలోని మార్లమాడికి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వేదవతి నదికి వరద నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి కర్ణాటకలోని ఎగువ ప్రాంతలో కురిసిన భారీ వర్షానికి వరద నీరు నదిలో ప్రవహిస్తోంది. ఇప్పటికే వేదవతి నది వంతెనను వరదనీరు తాకుతున్నాయి. నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే, కర్ణాటక నుండి రాకపోకలు నిలిచే అవకాశం ఉంది.

ఎమ్మిగనూరులో 69.7 మి.మి వర్షపాతం

ఎమ్మిగనూరు మండలంలో సోమవారం 69.7 మి.మీ వర్షాపాతం నమోదైంది. మంగళవారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎమ్మిగనూరు మండలంలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, ఎర్రకోట, గువ్వలదొడ్డి, కడిమెట్ల, కడివెళ్ల, కందనాతి, మాస్‌మాన్‌దొడ్డి, కె. తిమ్మాపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పంటపొలాల్లో నీరు చేరాయి. వాగులు, వంకల్లో నీరు పారి పంటపొలాల్లోకి చేరడంతో ముందుగా సాగు చేసిన పత్తి, కంది పంటపొలాల్లో విత్తనాలు వర్షంనీటిలో కొట్టుకుపోయాయి. సోమవారం కురిసిన వర్షానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పంటలను సాగుచేసేందుకు విత్తనాల దుకాణాల ముందు బారులు తీరారు.

అలరించిన అంధుల సంగీత కచేరి

ఆలూరు, జూన్ 3: ఆలూరు మండలం పరిధిలోని కమ్మరచేడు గ్రామంలో కాడ సిద్ధేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తవ్వడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి పంచాక్షరిగవాయి శిష్యులు సిరుగుప్ప తాలూకా రావాళ గ్రామ నివాసి హంచ్చయ్య స్వామి హిరేమఠ వీరేశ స్వామి హిరేమఠ బృందం తరపున సంగీత కచేరి ఏర్పాటు చేశారు. పుట్టుకతో వీరు అందులైనా తమ అద్భుతమైన గాత్రంతో భక్తిపాటలు పాడి అందరినీ అలరించారు.

ప్రజా తీర్పును అందరూ గౌరవించాలి

ఆదోని టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు నేడు వెలువడనున్న సందర్భంగా ప్రతిఒక్కరూ ప్రజాతీర్పును గౌరవించాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫలితాల విడుదల సందర్భంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, ప్రజాతీర్పును అందరూ గౌరవించాల్సిందేనని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను శాంతియుతంగా పూర్తి చేయడంలో సహకరించాలని కోరారు.

పండ్లతోటలపెంపకం ఆర్థికాభివృద్ధికి సోపానం

పత్తికొండ, జూన్ 3 : పండ్లతోటల పెంపకం రైతుల ఆర్థికాభివృద్ధికి సోపానమని ఎంపీడీవో రామారావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏపీవో వెంకటేశ్వర్లుతో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉపాధిపథకం జాబ్‌కార్డుకలిగి ఉండి ఐదెకరాలలోపు పొలంకలిగిన రైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పండ్లతోటల పెంపకానికి అర్హులుగా గుర్తించుకోవాలన్నారు. ఈ పథకం కింద జామ, సపోటా, నిమ్మ, నారింజ, దానిమ్మ మొదలగు 15 రకాల పండ్లతోటలు, గులాబీ, మల్లె వంటిపూల తోటలు, మునగ వంటి త్వరగా ఆదాయాన్ని అందించే పంటరకాలసాగుకు 100 శాతం రాయితీతో అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు

మద్దికెర, జూన్ 3: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బీఎంస్‌పేట, మద్దికెర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పథకం పనలను పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఎవరి పేరు మీదో ఉందో.. వారే ఉపాధి హామీ పనులకు వెళ్లాన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

విద్యుత్ తీగలు ఎత్తుకెళ్లారు..

మద్దికెర, జూన్ 3: మద్దికెర గ్రామంలోని స్థానిక సాయినగర్ కాలనీలో నీటి పథకాలకు చెందిన మోటర్ల విద్యుత్ తీగలను దొంగలు ఎత్తుకెళ్లడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో కాలనీవాసులు రెండు రోజులుగా నీటి సమస్య ఉందని ఈవో మద్దిలేటి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ మాట్లాడుతూ నీటి పథకాలకు సంబంధించిన విద్యుత్ తీగలు ఎత్తుకెళ్లడం వల్ల నీటి సమస్య ఏర్పడిందని, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో కూడా పలుమార్లు విద్యుత్ తీగలు ఎత్తుకెళ్లారని గుర్తు చేశారు. ప్రజలకు నీటి సమస్యతలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలు విముక్తి కోరుతున్నారు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు)

తుగ్గలి, జూన్ 3: ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు నలిగిపోయారని, రాక్షసుల చెర నుంచి ప్రజలు విముక్తి కోరుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో రాష్ట్రంలో టీడీపీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని, పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు, కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు గెలుపొందాలని వీరభద్రస్వామికి ఆకుపూజ కట్టించడంతో పాటు 101 టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మండల ఉపాధ్యక్షుడు వెంట్రాముడు చౌదరి, మాజీ ఎంపీపీ గురుస్వామి, శ్రీనివాసులుగౌడు, మాజీ సర్పంచ్ చక్రాల వీరేష్, సర్పంచ్ విజయుడు, ఈరమ్మ, రాజేంద్రగౌడు, సంగాల క్రిష్ణ, వెంకటేశ్వర్లు, సోమశేఖర్ గౌడు, కృష్ణమూర్తి చౌదరి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వాన కురిసింది.. అరక కదిలింది

● ముమ్మరంగా విత్తన సాగు..



అరికెరలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

ఆలూరు రూరల్, జూన్ 3: నైరుతి రుతుపవనాల ముందుగా రైతులను పలకరించింది. తొలకరి వర్షాలకు పొలాలు పదును కావడంతో ఉత్సాహంగా రైతులు పొలం బాటపట్టారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని అరికేర, అరికేరతండా, కరడిగుడ్డెం, ముద్దనగేరి, హులేబీడు. తుంబళబీడు తదితర గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. అన్నదాతలు పొలాలను దుక్కులు దున్ని, చెదను చేస్తున్నారు. అలాగే బోరు బావుల కింద రైతులు మిరప. ఉల్లి పంటసాగు చేసేందుకు సిద్ధం అయ్యారు. రైతులు పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో వెంకటేశ్వర గౌడ్ సోమవారం సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు ఇస్తామని చెప్పారు.

జోరుగా పత్తినాట్లు

ఆస్పరి, జూన్ 3: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పన్నుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను చదును చేసుకుని విత్తనం నాటుకుంటున్నారు. మండలంలోని కైరుప్పల, యాటకల్లు, ఐనేకల్, కారుమంచి, డీ కోటకొండ, ములుగుందం తంగరడోణ, తురవగల్లు, అలిగేర, బిణిగేరి గ్రామాలలో పత్తి విత్తనాలు నాటు వేశారు. సుమారు మండలంలో 20వేల ఎకరాల మేరకు ఖరీఫ్ పంట సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఆది, సోమవారాల్లో 20 ఎంఎం వర్షపాతం నమోదయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోని పదునైన వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





అరికెర, ఆస్పరి మండలం యాకల్లులో పొలాల్లో విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

అల్లర్లకు పాల్పడితే కేసులు

కౌతాళం, జూన్ 3: మంగళవారం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో మండలంలో ఎవ రైన అల్లర్లకు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రౌడీషీట్లను నమోదు చేస్తామని కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల్లో ఎలా ఉన్న గెలుపు ఓటములు సహజమని ఎవరు కూడా ఫలితాలను వ్యక్తిగతంగా తీసుకోకుండా సామరస్యంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి పాటుపడాలని గ్రామాల్లో ప్రజల జీవన విధానాలకు భంగం కలిగించినా భయభ్రాంతులకు గురి చేసిన పోలీసు లాఠీ రుచి చూడాల్సి వస్తుందన్నారు. ఎలక్షన్ కోడ్ ఈనెల 6 వరకు ఉన్న నేపద్యంలో ప్రజలెవరు గుమిగూడకుండా ఉండాలని ర్యాలీలు, బాణ సంచాలను కాల్చుటకు అనుమతులు లేవన్నారు. చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

విత్తనాలు ఎప్పుడిస్తారు..?



విత్తనాల కోసం వేచి ఉన్నరైతులు

మద్దికెర, జూన్ 3: ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయనీ, వ్యవసాయ పొలాలను దుక్కు దున్నుఉని రైతులు సిద్ధం చేసుకున్నారన్నారు. విత్తనాలు ఎప్పుడు ఇస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. సోమవారం స్థానిక ఆర్‌బీకే కేంద్రం ముందు విత్తనాల కోసం ఎదురు చూశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి రవితో మాట్లడుతూ రెండు రోజులు మాత్రం విత్తనాలు సరఫరా చేసి పంపిణీ చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల విత్తనాలు నిల్వ లేవని, బయట కొందామంటే.. నాసిరకం విత్తనాలు ఇస్తారనీ అన్నారు. కేవలం ఒక్కరోజులోనే విత్తనాలు పంపిణీ చేసి మాకు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఏవో మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విత్తనాలు పంపుతామని తెలపడం జరిగతిందన్నారు.

దళితులకు సామాజిక సమానత్వమేది?

ఆదోని రూరల్, జూన్ 3 : స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా... దళితులు సామాజిక సమానత్వానికి నోచుకోలేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు కడితోట దావీదు ఆధ్వర్యంలో దళితుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ దళితులు కులవివక్షతను ఎదుర్కొంటున్నారన్నారు. చైతన్యం, పోరాటంతో మాత్రమే వాటిని తిప్పికొట్టగలమన్నారు. ఈనెల 28,29వ తేదీలలో ఆదోనిలో సామాజిక చైతన్య శిక్షణ తరగతులు ఉంటాయని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిక్కప్ప, మల్లికార్జున, యువరాజు, లక్ష్మన్న, చక్రవర్తి పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆదోని రూరల్, జూన్ 3 : రెండు రోజుల క్రితం నాగలాపురం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదోనికి చెందిన ఇస్మాయిల్ ద్విచక్ర వాహనంపై ఎమ్మిగనూరుకు వెళ్ళి తిరిగి ఆదోనికి వస్తుండగా, గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు నాగలాపురం సమీపంలో ఇస్మాయిల్ వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 3: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన ఎమ్మిగనూరు మండలం కలగొట్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. సోమవారం తెల్లవారుజామున వర్షం కురవడంతో జింకలు పొలాల్లోకి వచ్చాయన్నారు. ఆ సమయంలో కుక్కలు జింకల పై దాడి చేయడంతో ఒక జింక తీవ్ర రక్తగాయాలై మృతి చెందినట్లు తెలిపారు. దీనిని గమనించిన రైతులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, జూన్ 3 : ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి చెందిన ఫ్రాన్సిస్‌ను తాలుక పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఫ్రాన్సిస్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా, అదుపులో తీసుకొని అతని నుంచి 150 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుంపులుగా ఉండొద్దు : సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి

మద్దికెర, జూన్ 3: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు హోటళ్ల వద్ద, బజారుల్లో గుంపులుగా ఉండరాదని సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి దండోరా వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, హోటళ్లు కూడా తెరవరాదని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, లేకపోతే రావద్దన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎవరూ బాణాసంచా పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు చేయకూడదని పేర్కొన్నారు. ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

రాఘవేంద్ర రెడ్డి గెలవాలని పూజలు

పెద్దకడుబూరు, జూన్ 3: కంబదహళ్ టీడీపీ నాయకులు మురళి, మధు, రంగన్న ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాలని సోమవారం ఈశ్వర దేవాలయం, వాల్మీకి మహర్షి, ఆంజనేయస్వామికి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఏపీకి చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్న, తిమ్మప్ప, ఉరుకుంద పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన దేశాయి



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న దేశాయ్ మాధవరావు

నందవరం, జూన్ 3: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందవరం టీడీపీ నాయకుడు రాజన్న కుమారుడు చందును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు సోమవారం పరామర్శించారు. డాక్టర్లతోమాట్లాడి ఆయన పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెలుగు ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తులకు రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, జూన్ 3: రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే కార్యక్రమాలు బంద్ చేశారు. దీంతో మఠం పండితుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం చేశారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనంను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక టెట్రా ప్యాకెట్ల పట్టివేత

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 3 : ఎమ్మిగనూరు పట్టణంలోని ఇందిరానగర్‌లో దాచి వుంచిన కర్ణాటక అక్రమ మద్యంను ఎమ్మిగనూరు సెబ్ సీఐ ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేసి పట్టుకున్నారు. ఎమ్మిగనూరు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక అక్రమ మద్యం దాచిన బోయ తిక్కస్వామి అలియాస్ బుజ్జి, జయరామ, బోయ గోపాల్ నుంచి 576 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ మద్యం మార్కెట్‌లో దీని విలువ రూ 37000 ఉంటుందని, నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు,

నిర్మాణాలు వేగవంతం చేయాలి

తుగ్గలి, జూన్ 3: అదనపు తరగతి గదుల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అలాగే నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఈఈ రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తదితర గ్రామాల్లోని అదనపు గదుల నిర్మాణాలతో పాటు కేజీబీవీ పాఠశాల ఇంటర్ తరగతి గదుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గదుల నిర్మాణాలను వేగవంతం చేయాలని అలాగే నాణ్యత పాటించకపోతే బిల్లులు చెల్లించేది లేదన్నారు.

ఐదు పోలీస్ టీంలతో ప్రత్యేక పర్యవేక్షణ

ఎమ్మిగనూరు రూరల్, జూన్3: నేడు జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎమ్మిగనూరు మండలంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ ఉండేందుకు గాను ప్రత్యేక పోలీస్ టీంలను ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గెలుపు కూటమిదే..

● అధైర్యపడకుండా సహనం పాటించండి
● కూటమిదే విజయం
● ఏజెంట్లకు టీడీపీ నేతల సూచనలు



కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలు ఇస్తున్న నాయకులు

మంత్రాలయం, జూన్ 3: మంగళవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో జరిగే ఎన్నికల కౌంటింగ్ ఫలితాల్లో కూటమిదే విజయం అని, ఏజెంట్లు సహనం పాటించి ధైర్యంగా కౌంటింగ్ హాలులో సూచించిన నిబంధనల ప్రకారం నియమాలు పాటించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం కర్నూలు కృష్ణనగర్‌లోని రావూరి ఫంక్షన్ హాలులో మంత్రాలయం నియోజకవర్గంలోని పార్లమెంటు, అసెంబ్లీ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అధికారులు పోలిసు యంత్రాంగానికి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా కౌంటింగ్‌లో ఉండాలన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే.. అనవసరమైన రాద్ధాంతాలకు వెళ్లకుండా ఆర్వోకు తెలియజేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కర్నూలు జిల్లాలో కూటమి విజయ పరంపర కొనసాగుతుందని, రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్‌లో కూటమికే మెజారిటీ స్థానాలు వచ్చాయని గుర్తుచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని, రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు జూన్ 4 చరిత్రలో ప్రజలు గుర్తించుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చావిడి వెంకటేష్, అశోక్ రెడ్డి, వరదరాజులు, నరసింహ, పల్లెపాడురామిరెడ్డి, ముత్తురెడ్డి, రామక్రిష్ణ, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.